# తులసిమాల

మరోసారి అతనివైపు చూసాను.

చేతులు వెనకకు తిప్పి, తలకింద పెట్టుకొని, పడక కుర్చీలో వాలి వున్నాడు అతడు.

సగం మూసిన కళ్ళతో, దీర్ఘాలోచనలో వున్న అతడు యోగ నిద్రలో వున్నట్లు కనబడ్డాడు. ముడతలు పడినా, తేజోవంతమైన ముఖం, నుదుటి మీద, గుండె మీద, భుజం మీద నామాలు- పెదవిపై విరిసి విరియని చిరునవ్వు- ఆ నిమిషంలో అతడు నాకు దేవుడిలాగే కనబడ్డాడు.

అవును మరి! అతడు దేవుడే! నాకే కాదు నాతో పాటు మా కర్మాగారంలో పని చేసే వెయ్యిమంది ఉద్యోగులకు కూడా అతడు దేవుడే! అతడు ప్రసాదించి ఇచ్చే వరం మీదనే మా జీవితాలు ఆధారపడి వున్నాయి. అందువల్లే పొదలు పుట్టలు దాటి కొండలెక్కి దర్శనం కోసం దేవుని వద్దకు చేరే భక్తుడిలా ఊర్లు తిరిగి, సందూ సందూ వెదికి ఇక్కడికి చేరుకున్నాను. అతని గురించి వెతుకుతూ తిరిగిన దూరం గురించి తలచుకుంటే నా మోకాళ్ళు వణుకుతున్నాయి. చివరికి ఈ చిన్నగదిలో దొరికింది దర్శనం!

"యంత్రం ఆగే ముందు పెద్ద శబ్దం వచ్చిందా?" అతడు అడిగాడు.

"లేదు"

"ఆగే ముందు వైబ్రేషన్స్ (కంపనలు) ఎలా వుండేవి?"

"లిమిటులోనే వుండేవా?"

జవాబు చెప్పాను.

"ఫౌండేషన్ బోల్టులు ఎలా వున్నాయి?"

చెప్పాను అంతవరకు మేం చూసినవీ, చేసినవీ వివరంగా చెప్పాను.

మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు అతడు. గది అంతా ఒకసారి కలయచూశాను.

చాలా చిన్న గది. ఒక ఇరుకు సందులో వుంది ఆ గది. సందు చాలా రద్దీగా వుంది. సందు చివర ఏదో గుడి ఉన్నట్లు ఉంది. గుడికి వెళ్ళే వారి మాటలు, పూలూ, కొబ్బరి కాయలు అమ్మే వారి కేకలు, ఆటో వారి గోల, వీటి మధ్య ఆ చిన్న గది ఆ గదిలో అతని పడక కుర్చీ. ఆ కుర్చీ ముందు ఒక పొట్టి బల్ల– బల్ల మీద ఒక వారగా కొన్ని పుస్తకాలు అతని మనసులా శుభ్రంగా వుండే గది గోడలు పడక కుర్చీలో కేవలం ఒక తెల్ల దోతి చుట్టుకొని అతడు.

నాకు ఆశ్చర్యం వేసింది. వెయ్యి కోట్ల రూపాయలు సంవత్సరానికి ఆదాయం ఆర్జించే ఒక కంపెనీకి కార్యనిర్వహణాధికారిగా పని చేసిన అతడు అన్ని సదుపాయాలు కలిగిన బంగ్లాలో బ్రతికిన అతడు– ఇలా ఈ సందులో... ఈ ఇరుకు గదిలో...

అదే వరదాచారి ప్రత్యేకత! మాటల్లోనే కాదు, పనిలో కూడా మిగతా వారికి భిన్నంగా వుండేవాడు. అతడు. పని విషయంలోనైతే అతనికి మించిన నిపుణుడు లేడు. అందువల్లనేగా, అతన్ని వెతికి పట్టుకోవలసి వచ్చింది!

ఆగిపోయిన ఒక కీలక యంత్రాన్ని, మళ్ళీ నడిపించడానికి ఏదైనా సూచన ఇస్తాడేమోననే ఆశతో అతన్ని వెతికి పట్టుకున్నాను. ఒకప్పుడు, మా కంపెనీకి కార్య నిర్వహణాధికారిగా పని చేసిన అతన్ని ఎలాగోలా కలవమని యాజమాన్యం వారి ఆదేశం.

చక్కగా పని చేసే యంత్రం హఠాత్తుగా పని చెయ్యడం మానేసింది. ఆ యంత్రం పని చెయ్యకపోతే ఉత్పత్తి జరగదు. రోజూ కోట్ల కొద్దీ నష్టం.

గంట, గంటకి వేలకొద్ది కరెంటు యూనిట్లు, కిలోల కొద్ది చమురు మింగే ఆ యంత్రం, కుంభకర్ణుడిలా పడుకుంది. లేపడానికి శతవిధాల ప్రయత్నం చేశాం. శూలాలతో పొడిచాం, సుత్తులతో బాదాం, నిలయ విద్వాంసుల పనితనం చాలలేదని పై నుంచి విదేశం నుంచి కూడా నిపుణులను తీసుకొచ్చాం. ఆ రాక్షసుడ్ని తయారుచేసిన బ్రహ్మ కూడా తన నిపుణులను పంపాడు. వాళ్ళు కూడా ఏమీ చెయ్యలేక పోయారు. సృష్టించడమే తమ పని అని నడిపించడం తమ వంతు కాదని అందువల్ల మరో యంత్రం తయారు చేయించుకోమని చెప్పారు. మరో యంత్రం తయారు చేయించుకోవాలంటే నెలలు పడతాయి, పైగా లక్షల ఖర్చు.

యంత్రం లేనిదే ఉత్పత్తి జరగదు– ఉత్పత్తి లేకపోతే ఉద్యోగుల జీతభత్యాలు, దేశంలోని అధిక శాతం పరిశ్రమలలా మాది కూడా ఆర్థిక స్తోమతు లేని పరిశ్రమయే!

దిక్కు తోచని యాజమాన్యం, ఇలాంటి సందర్భాల్లో, ఎప్పుడూ చేస్తున్నట్లుగానే, మేనేజర్ల, ఇంజినీర్ల సమావేశం ఏర్పాటు చేసారు. మేధోమథనం అన్న మాట ఇబ్బందులు లేక సుఖంలో తేలేటప్పుడు గుర్తుకు రాని దగ్గర చుట్టాలను కష్టంలో పడగానే గుర్తించినట్లు

లాభాలు ఆర్జించినప్పుడు ఉద్యోగుల అభిప్రాయం గురించి పట్టించుకోని యాజమాన్యం యంత్రం ఆగిపోయినందువల్ల ఎదురయిన పరిస్థితుల గురించి, ఆర్థిక సమస్యల గురించి వివరించి, సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరినీ సలహా ఇవ్వవల సిందిగా అడిగింది.

"నాదో చిన్న మాట, సర్..." మెల్లగా ఆగి ఆగి ఎం.డి. గారి ముఖకవళికలు గమనిస్తూ అన్నాడు సాంకేతిక విభాగాధ్యక్షుడు. "ఎందరో నిపుణులు వచ్చి చూసి వెళ్ళారు కదా. ఒకసారి... ఒకసారి... వరదాచారిని కూడా పిలిస్తే..."

"వరదాచారి మీకు తెలుసా?" ఎం.డి. అడిగారు.

"ఒకసారి చూశాను- చాలా యేళ్ళ క్రితం ఒక సెమినార్‌లో అతని నైపుణ్యం గురించి చాలా విన్నాను. రియల్లీ ఏ జీనియస్! సెమినార్‌లో కూడా అతని పేపర్‌నే అందరూ మెచ్చుకున్నారు".

ఎం.డి. స్పందించలేదు.

"అతడు ఇక్కడ నుండి వెళ్ళిపోవడం వల్లే కదా, నేను వచ్చాను".

కళావిహీనమైంది ఎం.డి. ముఖం.

"ఆలోచించండి. ఇలాంటప్పుడు పట్టింపులు వుండకూడదు. నడి సముద్రంలో మునుగుతున్నప్పుడు చిన్న గడ్డిపోచనైనా వదలకూడదు కదా... వరదాచారి సమర్థులు".

"నిజమే" ఎం.డి. స్పందించలేదు. "కాని ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో..."

"వెదుకుదాం. ఆరు నెలల క్రితం గుజరాత్‌లో వుండేవాడట!"

"సరే... మరో సంగతి... దొరికితే మన పని అంటే వస్తాడా కాని... అతడు ఏ పరిస్థితుల్లో ఇక్కడ ఉద్యోగం మానేశాడని..."

"విన్నాను. అతడు గొప్ప మనిషి. రాగద్వేషాలకు అతీతుడు. పని అంటే దేవుడని అనుకునేవాడు. ఒక ప్రయత్నం చేద్దాం".

అలా మొదలైంది నా ప్రయాణం. వరదాచారిని వెదుకుతూ, తిరుగుతూనే ఉన్నాను. చివరికి, ఈ రోజు, ఇక్కడ దర్శనం లభించింది. వరదాచారి ముందున్న పొట్టి బల్ల మీద యంత్రం తాలూకు డ్రాయింగ్ ఉంది. ఆ డ్రాయింగ్ సూక్ష్మంగా పరిశీలించాడు అతడు. కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు వాన చుక్క కోసం ఎదురు చూసే చకోరపక్షిలా అతని పెదవి నుండి రాలే మాట కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను.

అతడు ఆ యంత్రాన్ని తన మనసులో, ఈపాటికి పార్టు బై పార్టు ఊడతీసి వుంటాడు.

అతడు, ఎప్పుడూ అంతే! ఎక్కువగా మాట్లాడడు. ఏ సమస్యనైనా చిటికెలో పరిష్కరించేవాడు. ఏవేవో రాగాలు తీస్తూ దగ్గర నిలబడి పని చేయించేవాడు. అతన్ని

ఏరికోరి మా కర్మాగారంలోకి తెచ్చుకున్నారు ఎం.డి.గారు. ఎవరికీ తల వంచకుండా వుండటం, మనసులోని మాట కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం అతని స్వభావం. ఇంటర్వ్యూలోనే ఆ సంగతి గమనించారు ఎం.డి. గారు.

"అయితే జీతం ఎంత ఎక్స్‌పెక్టు చేస్తున్నావు?" ఎం.డి. అడిగారట.

"నేను చేయవలసిన పని మీకు తెలిసినప్పుడు ఇవ్వవలసిన జీతం తెలియదా?" ఎదురు ప్రశ్న వేశాడు వరదాచారి.

ఖంగు తిన్నాడు ఎం.డి. అంతవరకు అంత ధైర్యంగా అతని ఎదుట మాట్లాడిన వాడు లేదు. ఉన్నత ఉద్యోగానికి వచ్చిన వారు కూడా పెదవులు పెగలకుండా గొణుగుతారు తప్ప గట్టిగా మాట్లాడరు. అతని ఎదుట పెదవి విప్పకపోవడమే వినయ విధేయతలకు నిదర్శనమని అనుకుంటారు. జీతం గీసి గీసి బేరమాడి ఎంత నిపుణుడినైనా వీలున్నంత తక్కువ జీతమిచ్చి ఉద్యోగంలో తీసుకోవడం ఎం.డి.కి అలవాటు.

"అయితే ఒక పదివేలు ఇచ్చానని అనుకోండి..." కొంటెగా అడిగాడు ఎం.డి.

"ఏం చేస్తారు...?"

"ఏం చేస్తాను...? పుట్టుకతో వచ్చిన బుద్ధి పుటకతో కాని పోదు అనే మాట మరోసారి రుజువైందని అనుకుంటాను".

ఆ మాటలు అసలు అర్థం కాలేదు ఎం.డి.కి. ఒక జమీందారీ కుటుంబానికి చెందిన ఎం.డి. మొదటితరం పారిశ్రామికవేత్తగా అవతారమెత్తినా అతని జన్మవాసనలు పోవు అనేది వరదాచారి ఉద్దేశ్యమని గ్రహించడానికి, తక్కువ కూలి ఇచ్చి శ్రమదోపిడి చేసే తన వారసత్వాన్ని ఎత్తిపొడుస్తున్నాడని గ్రహించడానికి గంటలు తీసుకున్నాడు. వరదాచారి ఏం మాట్లాడినా, ఎలా మాట్లాడినా అతని సాంకేతిక నైపుణ్యం కంపెనీకి అవసరమనేది ఎం.డి. గుర్తించాడు.

పనిలో చేరిపోయాడు వరదాచారి. అతడు పని రాక్షసుడు. రోజంతా కర్మాగారంలోనే గడిపేవాడు. ఆఫీసులో చూడవలసిన కాగితాలు ఇతర పనులు చూసాక ఇంజినీర్లకు, టెక్నీషియన్లను సలహాలిస్తూ కర్మాగారంలోనే తిరిగేవాడు. నాపట్ల ఎందుకో ప్రత్యేక అభిమానం ప్రదర్శించేవాడు కనుక నాకు అతనితో కొంత చనువు ఉండేది.

"సార్..." నేను ఒకరోజు అడిగాను "మీరు రాత్రి పదీ పన్నెండు వరకు కర్మాగారంలోనే వుంటారు కదా మరి మీ ఇల్లు... మీ పిల్లలు... మీ భవిష్యత్తు..."

"మీరేనయ్యా నా పిల్లలు. మీ భవిష్యత్తు గురించేనయ్యా, నేను పని చేసేది".

కంపెనీ క్లబ్బుల్లో కాని, డిన్నర్లలో కాని కనబడేవాడు కాదు వరదాచారి. రోజు సాయంత్రం క్లబ్బు వద్ద వుండే "స్విమ్మింగ్ పూల్" వద్ద కూర్చుని కబురులాడుకోవడం

ఉన్నతాధికారులకు అలవాటు. కంపెనీకి సంబంధించిన కీలక నిర్ణయాలు కూడా వాళ్ళు అక్కడే తీసుకుంటారనేది బహిరంగ రహస్యం. అక్కడ బీర్ గ్లాసులు ముందు పెట్టుకొని కబుర్లాడే బదులు, ఇంజినీర్ల వద్ద కర్మాగారంలో గడిపితే పని తొందరగా అవుతుందని చెప్పేవాడు వరదాచారి. అంతేకాదు పని పట్ల అంకిత భావమున్న వాడికి ఎప్పుడూ మానసిక అలసట వుండదని కూడా అనేవాడు. పోనీ కంపెనీ డిన్నర్ల కన్నా రావేమిటని అడిగితే ఇంటిలో స్వయంపాకం చేసుకొని తిని కాసేపు శాస్త్రీయ సంగీతం విని గడపటం లోని ఆనందం వేరే దేనిలోనూ లేదనేవాడు.

"అలా అంటే ఎలాగండి?" ఒకసారి నేను అడిగాను.

"కంపెనీ డిన్నర్లు వగైరాలు అందరూ కలుసుకోవడానికి మానవ సంబంధాలు పెంపొందించుకోవడానికే కదా? వృత్తిలో పైకి రావాలన్నా, జీవితం విజయవంతం కావాలన్నా మానవ సంబంధాలేగా ముఖ్యం?"

"నిజమే. కాని అక్కడ దృశ్యం నేను చూస్తూ నిలబడలేను. ఆత్మీయమైన, నిజమైన వాతావరణం ఉండదక్కడ. ప్రతి ఒక్కరు పోయి ముఖాలు ధరించి దర్శనమిస్తారు. కుక్కల్లా కలియబడి తింటారు. అయినా, నా సొంత జీవితం నాది. నిజం చెప్పాలంటే ఈ ఉద్యోగం నేను ఆత్మ సంతృప్తి గురించి చేస్తున్నాను."

"అంటే..."

"వచ్చే జీతం గురించి చేస్తున్నానని అనుకున్నారేమో... జీతం గురించి ఆలోచిస్తే దీనికన్నా రెండింతలు జీతం ఇవ్వడానికి సిద్ధంగా వున్నవాళ్ళు ఉన్నారు"

"మరి..."

"సరైన సాంకేతిక పరిజ్ఞానం లేక అప్పుల ఊబిలో కూరుకుపోయే కంపెనీ పైకి రావాలని చెయ్యి అందిస్తున్నాను. నా సాంకేతిక నైపుణ్యం పంచుతున్నాను. మరో తరాన్ని తయారు చేస్తున్నాను. ఉద్యోగం ద్వారా దేశ సేవ, సామాజిక సేవ చేస్తున్నాను."

ఏమీ మాట్లాడలేకపోయాను నేను.

"బ్రతకటానికి డబ్బు కావాలి" అతడు మళ్ళీ అన్నాడు "అందువల్ల ఇచ్చిన జీతం పుచ్చుకుంటున్నాను."

ఇన్ని మాటలు చెప్పే వరదాచారి ఆదివారం మాత్రం ఎవరికీ దొరికేవాడు కాదు. పొద్దునే తన సొంత కారు స్వయంగా డ్రైవ్ చేసుకొని వెళ్ళేవాడు. ఎక్కడికని, ఎందుకని ఎవ్వరికీ తెలిసేది కాదు. అతని ఆదివారాల ప్రయాణాల గురించి రకరకాలుగా అనుకునే వారు, అందరూ. మందు కొట్టి మజా చెయ్యడానికి వెళ్తున్నాడని కొందరు, పెళ్ళాం లేనందువల్ల తిరుగుతున్నాడని మరికొందరూ అనేవారు.

ఆ మాటలు బహుశా అతని చెవుల్లో కూడా పడి వుండవచ్చు. ఒక ఆదివారం నన్ను కూడా తీసుకొని వెళ్ళాడు. ఇంచుమించు నలభై మైళ్ళు ప్రయాణం చేసాక, ఒక చిన్న పట్టణంలోని ఒక హాస్టల్ చేరుకుంది కారు. అక్కడ కొందరు పిల్లలు అతని గురించి ఎదురు చూస్తూ కనబడ్డారు. వాళ్ళకి ఇంజినీరింగ్ లెక్కలు ఉచితంగా బోధిస్తాడట అతడు! అంతేకాదు ఫీజు చెల్లించలేని వాళ్ళకు ఫీజు కూడా కట్టి చదివిస్తాడట!

"చూడండి గణపతి గారు" వరదాచారి అన్నాడు.

"సంపాదించిన డబ్బంతా మనమే తినడం కాదు. అవసరమున్న వారిని ఆదుకోవడానికి తక్కువ స్థాయిలో ఉన్నవారిని మన స్థాయికి తెచ్చుకోవడానికి కూడా మన డబ్బు వినియోగించాలి. అప్పుడే మనం మానవులవుతాం. అయినా మనిషి బ్రతకడానికి ఎంత డబ్బు కావాలి...?"

ఆ ప్రశ్న ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది. "మనిషి బ్రతకడానికి ఎంత డబ్బు కావాలి...?" మిగతా డబ్బు మన సమాజం గురించి వినియోగిస్తే..."

వరదాచారి బాధ్యతలు చేపట్టిన తరువాత కంపెనీ బాగా పుంజుకుంది. లాభాలు పెరిగాయి. కాని హఠాత్తుగా ఒకరోజు రాజీనామా చేశాడు అతడు.

వరదాచారి రాజీనామా గురించి మేనేజర్లు, వాళ్ళల్లో వాళ్ళే గుసగుసలాడుకున్నారు. అతడు రాజీనామా ఇవ్వవలసిన అవసరం లేదనేది వాళ్ళ అభిప్రాయం. అతడు సిఫార్సు చేసిన ఒక ఇంజినీర్‌కు ప్రమోషన్ ఇవ్వక ఎం.డి. తన దగ్గర వాడికి అర్హత లేకపోయినా, ప్రమోషన్ ఇచ్చారట! ప్రైవేటు రంగ సంస్థలో ఇలాంటివి మామూలే కనుక పట్టించుకోకూడదని అన్నారు వాళ్ళు. కాని వరదాచారి వాళ్ళ మాటలతో ఏకీభవించలేదు. ఇలాంటి ఆలోచనా రహిత చర్యలే పరిశ్రమలకు కీడు చేస్తున్నాయని, తన మాటకు విలువ లేనిచోట పని చెయ్యనని అన్నాడు వరదాచారి.

ఆ రోజు డ్యూటీ ముగిసిన తరువాత తన ఒకే ఒక పెట్టె కారులో పడేసుకొని అస్తమయ సూర్యునితో పాటు ఫ్యాక్టరీ గేటు దాటాడు అతడు. ఎవరూ అతనికి వీడ్కోలు చెప్పలేదు. ఆ మరునాడు మా కంపెనీలో సూర్యుడు ఉదయించలేదు.

అప్పటి నుండి రోజు రోజుకు చిక్కబడే చీకటిని తొలగించే సూర్యకిరణాల కోసం వెదుకుతునే వున్నాం.

మెల్లగా కళ్ళు తెరిచాడు అతడు. ముందుకు వంగి సర్దుకొని కూర్చున్నాడు. ముక్కు చివరికి జారిన కళ్ళద్దాలు సవరించుకున్నాడు. బల్ల మీద నుండి 'పెన్సిల్' తీసి డ్రాయింగ్ మీద రెండు చోట్ల చిన్న వలయాలు గీస్తూ అన్నాడు. "ఇక్కడ ఓపెన్ చెయ్యండి లోపల చిన్న 'రివెటు' ఉంటుంది. అది తీస్తే చిన్న 'షాఫ్టు' కనబడుతుంది. అది విరిగిపోయి

వుండవచ్చు. లేకపోతే 'జాం అయి వుండవచ్చు'.

నా ఆనందానికి అవధులు లేవు. దేవుని వరం అందిన భక్తుడిలా పులకించి పోయాను. ఒక ఉదుటున బయటకు వచ్చాను. నా ఆనందం వెన్నెలగా విరిసి ఊరంతా వ్యాపించి వుంది.

మరో నెల రోజులు తరువాత మళ్ళీ కలిశాను, అతన్ని, అదే చిన్న గదిలో. కర్మాగారం మళ్ళీ పని చెయ్యడం మొదలైందని చెప్పడమే కాక అతని సలహా గుర్తించి యాజమాన్యం బహుమతిగా ఇచ్చిన నగదు అందచేయడం కూడా ఆ కలయికలో ఉద్దేశం.

"నాకెందుకు డబ్బు?" అతడు అడిగాడు "నేనెప్పుడైనా, డబ్బు దృష్టితో పని చేశానా?"

"లేదు. కాని మనిషి అన్నాక అవసరాలు వుంటాయి కదా?"

"ఉంటాయి కాని నాకు అవసరాలు తక్కువ. అందువల్ల ఇలా ఆనందంగా ఉన్నాను అవసరమైన ఆర్భాటాల వెనక పరుగు తీయడం వల్లే మనిషి ఆనందకరమైన జీవితాన్ని కోల్పోతున్నాడు. మీరు ఎప్పుడైనా రావచ్చు. వ్యక్తిగా కానీ యాజమాన్యం తరఫున కాని నా సాంకేతిక పరిజ్ఞానం మానవ ప్రగతి కోసం పంచడానికి సిద్ధంగా వున్నాను"

ఏమనాలో తోచలేదు నాకు.

"చూడండి గణపతిగారు, నేను మీతో పని చేసినప్పుడు ఒక తప్పు చేశాను. ఈ యంత్రం గురించి మీకు పూర్తిగా చెప్పలేదు కాబోలు. అందువల్లే మీరు నావద్దకు రావలసి వచ్చింది. ప్రైవేటు రంగ సంస్థల్లో పనిచేసే వాళ్ళలో కొందరిలా సాంకేతిక పరిజ్ఞానాన్ని నాలోనే దాచుకుంటేనే ప్రాముఖ్యం పెరుగుతుందని నేను అనుకోవటం లేదు. నా వల్ల మీకు యాజమాన్యానికి ఇబ్బంది కలిగినందుకు నన్ను మన్నించండి. విష్ యూ ఆల్ ద బెస్ట్"

నా కళ్ళలో నీళ్ళు నిండాయి. బయటకు వచ్చాను.

రోడ్డు గందరగోళంగా వుంది. గుడిలోకి వెళ్ళే వారి మాటలు– గుడిగంటల మ్రోత– పూలమ్మే వారి కేకలు– మంత్రోచ్చారణల హోరు– హఠాత్తుగా నాకు అనిపించింది– దేవుడి దర్శనం చేసుకుంటే బాగుంటుందని. నా పాదాలు గుడివైపు సాగాయి. పూలమ్మే వాడి దగ్గర నుండి ఒక తులసిమాల కొన్నాను. వెనక్కు తిరిగి గబగబా నడిచాను. వరదా చారి గది గుమ్మం మీద ఆ తులసిమాల వేసి మా ఊరు వెళ్ళిపోయాను.

***